# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

❖ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

❖ ఇటీవల పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులను షైనింగ్ స్టార్స్ అవార్డులతో రాష్ట్ర ప్రభుత్వం సత్కరించింది.

❖ ఎన్డీయే కూటమి ప్రభుత్వంతో దేశంలోనూ, రాష్ట్రంలోనూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగవంతం అవుతాయని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు.

❖ విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణం కోసం నిర్దేశించిన ప్రాంతాలను ఈరోజు అధికారులు పరిశీలించారు.

=======================

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. స్వర్ణాంధ్ర కార్యాలయాలను రాష్ట్ర సచివాలయం నుంచి ఈరోజు ఆయన దృశ్యమాధ్యమం ద్వారా ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.... సేవరంగం నుంచి 6.3 శాతం ఆదాయం లభిస్తుందని, దీనిని విస్తరిస్తే ఆదాయం మరింత పెరుగుతుందని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యమిస్తూ.. ముందుకెళ్తున్నామని చెప్పారు. అభివృద్ధి అనేది అన్ని ప్రాంతాల్లో సమాంతరంగా జరగడమే తమ లక్ష్యమన్నారు. విశాఖపట్టణాన్ని ముంబయి నగరంలా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విశాఖకు అనేక పరిశ్రమలు, ఐటీ సంస్థలు వస్తున్నాయని, రైల్వే జోన్ పనులు ప్రారంభం అవుతున్నాయని చెప్పారు. సాంకేతికతకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని, భవిష్యత్‌లో ఇది కీలక పాత్ర పోషిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 40 సెకన్లు)

=======================

ప్రభుత్వ విద్యావ్యవస్థను ప్రైవేటు రంగానికి మించి అద్భుతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతోనే విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చామని రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ ప్రధానోత్సవంలో భాగంగా ఈరోజు పార్వతీపురంలో నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రతిభ కనబరిచిన పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్ధలకు మంత్రి అవార్డులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయడానికే అనేక చర్యలు చేపట్టమని తెలిపారు. మెరుగైన ఫలితాల సాధనకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నామన్నారు. అవకాశాలను అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని మంత్రి నారా లోకేష్ ఆకాంక్షిస్తూ...

(వాయిస్ 39 సెకన్లు)

అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు నిర్వహించిన షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమంలోరాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. అందులో భాగంగా శ్రీకాకుళంలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తో కలసి విద్యార్థులకు అవార్డులను అందజేశారు. విజయనగరంలో హోమ్ మంత్రి వంగలపూడి అనిత విద్యార్థులను సత్కారించారు. అలాగే విజయవాడలో మంత్రి సత్యకుమార్ యాదవ్, తిరుపతిలో అనగాని సత్యప్రసాద్‌లు ఈ అవార్డుల ప్రధానోత్సవానికి హాజరయ్యారు.

విరామం

=======================

గత 11 సంవత్సరాలలో 140 కోట్ల మంది భారతీయుల ఆశీర్వాదం సమిష్టి భాగస్వామ్యంతో భారత్ అనేక రంగాలలో వేగవంతమైన ఆర్థిక పరివర్తనలను చూసిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. "సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్" అనే సూత్రాన్ని అనుసరించి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఈ ప్రయాణంలో అత్యంత వేగం సున్నితత్వంతో విప్లవాత్మక మార్పులను అందించిందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈరోజు పేర్కొన్నారు. ఆర్థిక వృద్ధి నుండి సామాజిక అభ్యున్నతి వరకు ప్రజల సమ్మిళిత, సమగ్ర పురోగతిపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందని నరేంద్ర మోదీ అన్నారు. నమో యాప్‌లో అందుబాటులో ఉన్న ప్రత్యేక కథనాలు, వీడియోలు, ఇన్ఫోగ్రాఫిక్స్ ద్వారా భారతదేశ వికాస్ యాత్రను అన్వేషించాలని ఈ సందర్భంగా ఆయన ప్రజలను కోరారు.

=======================

విశాఖపట్నంలో మెట్రో రైల్ ప్రాజెక్టు నిర్మాణం కోసం నిర్దేశించిన ప్రాంతాలను ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) ప్రతినిధులు ప్రాజెక్టు అధికారులతో కలిసి ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ కార్పోరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ... కొమ్మాది నుంచి కూర్మన్నపాలెం వరకు మెట్రో స్టేషన్ల కోసం నిర్దేశిత ప్రాంతాలను పరిశీలించామని చెప్పారు. 46.23 కిలో మీటర్ల మేర చేపట్టే ఈ మెట్రో రైలు ప్రాజెక్టులో మొత్తం 43 స్టేషన్లు ఉంటాయని వివరించారు. మొదటి దశ నిర్మాణానికి సుమారు 11 వేల కోట్ల రూపాయల వ్యయం అవుతుందని వెల్లడించారు.

=======================

ఎన్డీయే కూటమి ప్రభుత్వంతో దేశంలోనూ, రాష్ట్రంలోనూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగవంతం అవుతాయని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తైన సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఈరోజు ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... అమరావతి అభివృద్ధికి ఇప్పటికే 15 వేల కోట్ల రూపాయలు, అంతకుముందు 2,500 కోట్ల రూపాయలు ప్రభుత్వం కేటాయించిందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి 12 వేల కోట్ల రూపాయలు మంజూరు చేసిందని వెల్లడించారు. నరసాపురం పార్లమెంటు పరిధిలో రైల్వే ప్రాజెక్టులు కోసం, జాతీయ రహదారుల విస్తరణ పనులు, రాష్ట్ర రహదారి నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించిందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

ఏజెన్సీలోని ప్రతి వ్యక్తి యోగా కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్యకరంగా ఉండాలని అల్లూరి సీతారామరాజు జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ్  పేర్కొన్నారు.  పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం నుండి వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బందితో యోగాంధ్ర కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఈరోజు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యోగా ద్వారా శారీరక ఉల్లాసం, మానసిక స్థిరత్వం, ఆరోగ్యవంతమైన సమాజాన్ని సృష్టించవచ్చన్నారు. ఈనెల 21వ తేదీన  విశాఖపట్నం ఆర్కే బీచ్ నుండి భీమిలి వరకు సుమారు 5 లక్షల మందితో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సాధించడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యమన్నారు.

========================

మొదటి సంవత్సరం ఎన్డీయే కూటమి ప్రభుత్వ పాలనలో అధికారుల సహకారంతో అన్ని జిల్లాల తొలిదశ సమీక్షలు పూర్తి చేశామని ఆంధ్రప్రదేశ్ 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మెన్ లంకా దినకర్ తెలిపారు. ఈరోజు వెలగపూడిలోని సచివాలయంలో నిర్వహించిన జిల్లాల సమీక్షలలో పథకాల వారీగా గుర్తించిన అంశాలను ఆయన వివరించారు. ఏడాది కూటమి పాలనలో రాష్ట్రం స్వర్ణ ఆంధ్రా వైపు అడుగులు వేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సహకార పాలన సాగితోందని, పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఇప్పటి వరకు 9.34 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడుల ఒప్పందాలు ఈ ఒక్క సంవత్సరంలోనే జరిగాయన్నారు. 25 లక్షల మందికి ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని లంకా దినకర్ వెల్లడిస్తూ...

(వాయిస్ 38 సెకన్లు)

========================
========================